క్లుప్తంగా

ఉమ్మడి జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక



అభినందిస్తున్న హెచ్‌ఎం, పీఈటీ

ఎలిగేడు: మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్ ఉన్నత పాఠశాలలో సోమవారం 68వ పాఠశాలల ఎస్‌జీఎఫ్ క్రీడల్లో జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించారు. అండర్–14 బాలికల విభాగంలో ధూళికట్ట జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న భూసారపు వైష్ణవి ఉమ్మడి జిల్లాకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం బి.సదయ్య తెలిపారు. కాగా విద్యార్థిని హెచ్‌ఎం సదయ్య, ఫిజికల్ డైరెక్టర్ వి.శ్రీకాంత్, టీచర్లు అభినందించారు.

ఠాణాలో స్వచ్ఛభారత్



శుభ్రం చేస్తున్న ఎస్సై స్వామి, సిబ్బంది

పాలకుర్తి: నిత్యం శాంతిభద్రతల పరిరక్షణ విధుల్లో ఉండే పోలీసులు పారిశుద్ధ్యం కార్యక్రమం చేపట్టారు. బసంత్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం స్థానిక సిబ్బంది ఆధ్వర్యంలో స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహించారు. ఎస్సై ఆర్.స్వామితో పాటు సిబ్బంది స్టేషన్ ఆవరణలోని చెత్తా చెదారాన్ని తొలగించారు. ఠాణా పరిసర ప్రాంతంలో ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించి శుభ్రం చేశారు. గుంతలను మట్టితో పూడ్చి వేశారు.

జిల్లాస్థాయి కబడ్డీ పోటీల్లో ప్రతిభ



అభినందిస్తున్న కరస్పాండెంట్ జాఫర్‌బేగ్

పాలకుర్తి: బసంత్‌నగర్‌లోని ఆలీవర్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు జిల్లాస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం స్వామి తెలిపారు. ఇటీవల సుల్తానాబాద్‌లో జరిగిన పోటీల్లో 7వ తరగతి విద్యార్థిని హాసిని, 9వ తరగతి విద్యార్థి కౌశిక్ ఉత్తమ ప్రతిభ కనబరిచి సిల్వర్‌మెడల్ సాధించారు. విద్యార్థులను పాఠశాల కరస్పాండెంట్ జాఫర్‌బేగ్, ఉపాధ్యాయులు అభినందించారు.


రైతు సమస్యలు పరిష్కరించాల్సిందే



మాట్లాడుతున్న ప్రదీప్‌కుమార్

పెద్దపల్లిరూరల్: ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అధికారంలోకి వచ్చిన తర్వాత విస్మరించిందని, ప్రజలు, రైతుల దృష్టి మళ్లించేందుకే హైడ్రా పేరిట కొత్త డ్రామాలకు తెరలేపిందని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుగ్యాల ప్రదీప్‌కుమార్ ఆరోపించారు. జిల్లా పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు సునీల్ రెడ్డి, రాష్ట్ర అధికారప్రతినిధి ఎస్.కుమార్‌తో కలిసి సభ్యత్వ నమోదు సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలకిచ్చిన హామీలు అమలయ్యేదాకా ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేలా బీజేపీ ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తుందన్నారు. జిల్లాలో సభ్యత్వ నమోదు ఉత్సాహంగా సాగుతోందని ఇప్పటివరకు 20వేల సభ్యత్వం పూర్తయిందన్నారు. నాయకులు కందుల సంధ్యారాణి, లావణ్య, పోచం, వెంకటరమణ, సంపత్‌రావు, రాము పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపిక



విద్యార్థిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్

ధర్మారం: మండల కేంద్రానికి చెందిన సాయి మణికంఠ హైస్కూల్ విద్యార్థిని దీపిక రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు సాయికుమార్ తెలిపారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాస్థాయిలో జరిగిన ఎస్‌జీఎఫ్ హ్యాండ్‌బాల్ పోటీల్లో దీపిక ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. దీపికను పాఠశాల కరస్పాండెంట్ జైన సురేశ్‌కుమార్, ఎండీ రమాదేవి అభినందించారు.



అప్పుడే మంచిగుండే..



సుల్తానాబాద్‌రూరల్: మా కాలంలో బతుకమ్మ పండుగకు తీరొక్క బతుకమ్మ పాటలు ఒక్కక్కరూ పాడుతుంటే.. అందరం దానికి అనుగుణంగా పాడేవాళ్లం. చప్పట్లు కొడుతూ అందరూ పాట పాడేవాళ్లు. ఇప్పుడు అందరూ డీజే పాటలు పెట్టుకొని విచిత్రంగా డ్యాన్స్‌లు చేస్తున్నారు. మా కాలంలోనే బతుకమ్మ పండుగ మంచిగా అనిపించింది. – సముద్రాల పుష్పలత (సుల్తానాబాద్)

చప్పట్లతో ఆడేవారేరి



యైటింక్లయిన్‌కాలనీ: ఆ రోజుల్లో ఉన్న పాత పాటలు ఇప్పుడు లేవు. అందరూ డీజే పాటలతో బతుకమ్మ ఆడుతున్నారు. కోలాటాలతో నృత్యాలు చేస్తూ చిన్నా, పెద్దా తేడా లేకుండా ఆడుతున్నారు. చప్పట్లతో ఆడేవారే లేరు. అప్పటి రోజులే బాగున్నాయి. – కత్తెర్ల లక్ష్మి, యైటింక్లయిన్‌కాలనీ, అల్లూరు

ఒక్కదగ్గరే ఆడేటోళ్లం



కాల్వశ్రీరాంపూర్: బతుకమ్మ పండుగ అచ్చిందంటే ఊరంతా సంబరంగా ఒక్క దగ్గరే ఆడుకునేటోళ్లం. ఎంగిల పూల బతుకమ్మ రోజు నుంచి తొమ్మిది రోజులు నీళ్లల్ల ఏసేదాకా ఊరంతా ఒక్క దగ్గరే ఎంతో సంబరంగా ఆడుకునేటోళ్లం. ఇప్పుడు మైకుల లొల్లి, కోలలు, ఎగురుడు. ఆ కాలమే మంచిది. – ముస్కు ఆగమ్మ, ఊశన్నపల్లె



సుల్తానాబాద్: అల్ఫోర్స్‌లో బతుకమ్మ సంబరాలు



పెద్దపల్లిరూరల్: ట్రినిటిలో బతుకమ్మవేడుకలు



పాలకుర్తి: యూనివర్సల్ పాఠశాలలో..



సుల్తానాబాద్: గర్రెపల్లి మోడల్‌స్కూల్‌లో..



ధర్మారం: బతుకమ్మ ఆడుతున్న విద్యార్థులు



జ్యోతినగర్: విశ్వభారతిలో..

ముందస్తు బతుకమ్మ సంబరాలు

బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో.. బంగారు బతుకమ్మ ఉయ్యాలో అంటూ చిన్నారుల సందడి అంతా ఇంతా కాదు.. బతుకమ్మ పండుగ సెలవులు రావడంతో జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల్లో మంగళవారం ముందస్తు బతుకమ్మ వేడుకలు జరుపుకున్నారు. బతుకమ్మ గొప్పతనాన్ని పిల్లలకు తెలిసేలా సంస్కృతి సంప్రదాయాలతో వేడుకలను ఘనంగా నిర్వహించారు పాటలకు తగిన స్టెప్పులు వేస్తూ విద్యార్థులు వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు బతుకమ్మ ఆడిన వేడుకలు సందడిగా కనిపించాయి. – సాక్షి నెట్‌వర్క్

లాభాల వాటాపై దుష్ప్రచారం చేస్తున్నారు



మాట్లాడుతున్న సారయ్య

రామగిరి: సింగరేణి సంస్థలో తమ ఉనికి కోసం కొన్ని యూనియన్లు లాభాల వాటాపై దుష్ప్రచారం చేస్తున్నాయని ఏఐటీయూసీ డిప్యూటీ జనరల్ సెక్రటరీ సారయ్య అన్నారు. ఏపీఏ ఏరియాలో మంగళవారం బ్రాంచ్ సెక్రటరీ ఎం.రామచంద్రారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. ఇతర సంఘాల నాయకులు వారి ఉనికి కోసం ఆరోపణలు చేయడం సరికాదని, వాస్తవాలు తెలుసుకోవాలని హితవు పలికారు. పలు కార్మిక సంఘాలు కార్మికులను రెచ్చగొట్టేందుకు ప్రయత్నం చేస్తున్నాయని, అలాంటి పనులు మానుకోవాలన్నారు. కొన్ని సంఘాలు చేసే అసత్య ప్రచారాలు నమ్మొద్దని, కార్మికుల సంక్షేమం కోసం నిరంతరం పోరాటం చేసేది ఏఐటీయూసీ మాత్రమేనని అన్నారు. డిప్యూటీ జనరల్ సెక్రటరీ వై.వి.రావు, సెంట్రల్ సెక్రటరీ జూపాక రాంచందర్, ఆర్జీ–3 వైస్ ప్రెసిడెంట్ సమ్మయ్య, పిట్ సెక్రటరీ గంగాధర్, నాయకులు కుమార్, కిరణ్, ఏపీఏ మైన్ పిట్ కమిటీ సభ్యులు, కార్మికులు పాల్గొన్నారు.

బాస్కెట్‌బాల్ పోటీలు ప్రారంభం



క్రీడాకారులతో అధికారులు

గోదావరిఖని: స్థానిక జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో వర్క్ పీపుల్స్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బాస్కెట్‌బాల్ పోటీలను మంగళవారం అధికారులు ప్రారంభించారు. క్రీడాస్ఫూర్తితో ముందుకు సాగి కోలిండియా స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు మడ్డి ఎల్లాగౌడ్, పర్సనల్ మేనేజర్ రవీందర్‌రెడ్డి, స్పోర్ట్స్ గౌరవ కార్యదర్శి సారంగపాణి, కోఆర్డినేటర్ సంతోష్‌రెడ్డి పాల్గొన్నారు.

పండుగలకు ఏర్పాట్లు పూర్తి

సుల్తానాబాద్: సద్దుల బతుకమ్మ, దసరా పండుగలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ గాజుల లక్ష్మి తెలిపారు. స్థానిక మున్సిపల్ సమావేశ మందిరంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. మున్సిపల్ పరిధిలోని అన్ని కాలనీల్లో బతుకమ్మ ఆడే స్థలాలను శుభ్రపరిచి, లైటింగ్ ఏర్పాటు చేస్తున్నామని, ముఖ్య కూడళ్లలో విద్యుత్ దీపాలు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. కమిషనర్ ఆకుల వెంకటేశ్, వైస్ చైర్‌పర్సన్ బిరుదు సమతకృష్ణ, కౌన్సిలర్లు పసెడ్ల మమత, సంపత్, కూకట్ల గోపి, చింతల సునీత, రాజు, అనుమల అరుణ, బాబురావు, రెవెల్లి తిరుపతి, దున్నపోతుల రాజయ్య, గుర్రాల శ్రీనివాస్, కోఆప్షన్ ఫాతిమా ఖలీం, మేనేజర్ అలిమొద్దీన్, ఏఈ సతీశ్ పాల్గొన్నారు.

డీఎస్సీ ఫలితాల్లో ఎక్లాస్‌పూర్‌వాసికి ఫస్ట్ ర్యాంకు



దేవేందర్‌రెడ్డి

మంథని: ప్రభుత్వం ప్రకటించిన డీఎస్సీ ఫలితాల్లో ఫిజికల్ సైన్స్ స్కూల్ అసిస్టెంట్ విభాగంలో మంథని మండలం ఎక్లాస్‌పూర్ గ్రామానికి శీలం దేవేందర్‌రెడ్డి జిల్లా స్థాయిలో మొదటి ర్యాంకు సాధించాడు. తల్లిదండ్రులు, మిత్రులు, గ్రామస్తులు ఆయనకు అభినందనలు తెలిపారు.

మల్యాల వాసికి మూడో ర్యాంకు

కాల్వశ్రీరాంపూర్: మండలంలోని మల్యాలకు చెందిన మోడెం మునేశ్ డీఎస్సీ ఫలితాల్లో జిల్లాలో మూడో ర్యాంకు సాధించాడు. స్కూల్ అసిస్టెంట్ సోషల్ సబ్జెక్టులో 78 మార్కులు వచ్చాయి.

టీబీజీకేఎస్ ఆర్జీ–1 బ్రాంచి కమిటీ నియామకం

గోదావరిఖని: తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం ఆర్జీ–1 ఏరియా బ్రాంచి కమిటీని మంగళవారం ప్రకటించారు. బ్రాంచ్ సెక్రటరీలుగా దూట శేషగిరి, వాసర్ల జోసెఫ్, కోండ్ర అంజయ్య, సాయిచరణ్, మహేందర్‌రెడ్డి, జాయింట్ సెక్రటరీలుగా కళాధర్‌రెడ్డి, కొయ్యడ రమేశ్, మీస రాజు, కరాటి రాములు, తాటికంటి తిరుపతి, కోశాధికారిగా పర్లపల్లి అభిషేక్, ఆర్గనైజేషన్ సెక్రటరీలు గండు శ్రావణ్, పల్లె సురేందర్, చుక్కల శ్రీనివాస్, బొల్లం సత్యనారాయణ, అరీఫ్‌ను ప్రకటించినట్లు పేర్కొన్నారు. వర్కింగ్ ప్రెసిడెంట్ మాదాసు రామ్మూర్తి, ఏరియా ఉపాధ్యక్షుడు వడ్డేపల్లి శంకర్, నాయకులు నూనె కొమురయ్య, చెల్పూరి సతీశ్ పాల్గొన్నారు.

- **అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ**

సుల్తానాబాద్: పట్టణంలో అంగన్‌వాడీ కేంద్రాన్ని సుల్తానాబాద్ మున్సిఫ్ కోర్టు జడ్జి దుర్గం గణేశ్ మంగళవారం తనిఖీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న పౌష్టికాహారం అర్హులైన ప్రతి ఒక్కరికీ అందివ్వడంతోపాటు వారు తీసుకునేలా చూడాల్సిన బాధ్యత టీచర్లపై ఉందన్నారు. పిల్లలకు పలు రకాల పండ్లు పంపిణీ చేశారు. బార్ అసోసియేషన్ సెక్రటరీ జోగుల రమేశ్, లోక్ అదాలత్ మెంబర్ పబ్బతి లక్ష్మీకాంతరెడ్డి, న్యాయవాదులు మేకల తిరపతిరెడ్డి, సత్యనారాయణ, అంబాల రాజు, అంగన్‌వాడీ టీచర్ శ్రీలత పాల్గొన్నారు.

- **నిందితుడికి రెండున్నరేళ్ల జైలుశిక్ష**

గోదావరిఖనిటౌన్: వరంగల్ జిల్లా కొత్తవాడకు చెందిన బొద్దుల కిరణ్ అనే నిందితుడికి అత్యాచారయత్నం కేసులో గోదావరిఖని అడిషనల్ జిల్లా సెషన్స్ కోర్టు న్యాయమూర్తి టి.శ్రీనివాస్ రెండున్నరేళ్ల జైలు శిక్ష విధిస్తూ మంగళవారం తీర్పునిచ్చారు. వివరాల్లోకి వెళ్తే గోదావరిఖని తిరుమలనగర్‌లో 2020, ఫిబ్రవరి 2న బాధిత మహిళపై ఆమె భర్త, కొడుకు ఇంట్లో లేని సమయంలో వరుసకు మరిది అయిన బొద్దుల కిరణ్ అత్యాచారయత్నం చేశాడని బాధితురాలు గోదావరిఖని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అప్పటి సీఐ ఎ.మహేందర్ కేసు నమోదు చేశారు. కాగా మరో సీఐ పర్స రమేశ్ విచారణ జరిపి నివేదికను కోర్టులో దాఖలు చేశారు. నేరం రుజువు కావడంతో గోదావరిఖని అడిషనల్ జిల్లా సెషన్స్ కోర్టు న్యాయమూర్తి నిందితుడికి రెండున్నరేళ్ల జైలుశిక్షతో పాటు రూ.వెయ్యి జరిమానా విధించారు. నిందితునికి శిక్ష విధించడంలో కృషి చేసిన వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి, కోర్టు డ్యూటీ ఆఫీసర్ శంకర్‌ను రామగుండం సీపీ ఎం.శ్రీనివాస్, పెద్దపెల్లి డీసీపీ చేతన, గోదావరిఖని ఏసీపీ మడత రమేశ్ అభినందించారు.

- **పరామర్శ**

ధర్మారం: మండలంలోని నందిమేడారం గ్రామానికి చెందిన నేరేళ్ల వెంకమ్మ అనారోగ్యంతో మరణించారు. కాగా మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ మంగళవారం ఆమె కుటుంబ సభ్యులను మంగళవారం పరామర్శించారు. మాజీ జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు ఎండీ సలామొద్దీన్, మాజీ సర్పంచు గుర్రం తిరుపతి, ఐత వెంకటస్వామి, నాయకులు ఆవుల శ్రీనివాస్, వేణుగోపాల్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

- **భగీరథ నీరు తాగితే అంటువ్యాధులు దూరం**

ఓదెల: గ్రామాల్లో సరఫరా చేస్తున్న మిషన్ భగీరథ నీరు తాగితే అంటువ్యాధులు దూరయమవుతాయని గ్రిడ్ డిప్యూటీ ఈఈ అనిల్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గ్రామస్థాయి పంపు ఆపరేటర్లకు మంగళవారం వివిధ అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఏఈఈలు సంపత్, సంధ్య, పెద్దపల్లి ల్యాబ్ కెమిస్ట్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

- **ఆయిల్‌పాం సాగుపై అవగాహన**

జూలపల్లి: రైతులు ఆయిల్‌పాం సాగుపై అవగాహన పెంచుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి ఆదిరెడ్డి సూచించారు. మండలంలోని తేలుకుంట రైతువేదికలో రైతు జరిగిన నేస్తం కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అలాగే మండల కేంద్రంలో ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు.

- **సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి**

మంథని: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని మంథని డివిజనల్ పంచాయతీ అధికారి సతీశ్ కుమార్ సూచించారు. మంథని మండలం చిల్లపల్లి గ్రామపంచాయతీలో మంగళవారం పర్యటించారు.

- **బీజేపీ సభ్యత్వ నమోదు**

యైటింక్లయిన్‌కాలనీ: రామగుండం కార్పొరేషన్ యైటింక్లయిన్‌కాలనీ 16, 17, 18వ డివిజన్ ఏరియాలలో మంగళవారం కాలనీ బీజేపీ నేతలు సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. బీజేపీ దళితమోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసిపేట శివాజీ హాజరై కార్యక్రమం ప్రారంభించారు.

- **పెట్రోలింగ్ నిర్వహించాలి**

గోదావరిఖనిటౌన్: దసరా సెలవుల్లో ప్రభుత్వ పాఠశాలల్లో ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా పెట్రోలింగ్ నిర్వహించాలని డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్(డీటీఎఫ్) నాయకులు మంగళవారం గోదావరిఖని ఏసీపీ మడత రమేశ్‌గౌడ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. డీటీఎఫ్ రామగుండం అధ్యక్షుడు ఎస్.ఉమామహేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి ఎస్.రమేశ్, జిల్లా ఉపాధ్యక్షుడు బి.కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

- **గీత కార్మికులకు శిక్షణ**

పాలకుర్తి: పాలకుర్తి మండల కేంద్రంలో మంగళవారం గీత కార్మికులకు కాటమయ్య రక్షణ కవచంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. రామగుండం ఎమ్మెల్యే సతీమణి మనాలిఠాకూర్, ఎక్సైజ్ అధికారులు, గీత కార్మికులు, వివిధ గ్రామాల మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

- **ఉత్తమ విద్యార్థులకు నగదు ప్రోత్సాహకం**

రామగుండం: పట్టణంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 1982–83లో పదో తరగతి చదివిన విద్యార్థులు రామగుండం జెడ్పీహెచ్‌ఎస్‌లో 2023–24లో పదిలో అత్యధిక జీపీఏ సాధించిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకం అందజేశారు. మంగళవారం రామగుండం జెడ్పీహెచ్‌ఎస్‌లో టాపర్స్ అఫ్రీన్, ఆర్.రాహుల్‌సాయి, వి.చరణ్, సానియా, జశ్వంత్, వైష్ణవి, ఉర్దూ మీడియంకు చెందిన రేష్మకు నగదు ప్రోత్సాహకం అందజేశారు.

- **స్వచ్ఛతా హీ సేవాపై వ్యాసరచన పోటీలు**

కోల్‌సిటీ: రామగుండం నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం స్వచ్ఛతా హీ సేవా –2024లో భాగంగా విద్యార్థులకు అధికారులు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. నగరపాలక సంస్థ సెక్రటరీ రాజు, ఎన్విరాన్మెంటల్ ఇంజినీర్ మధుకర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సూపర్‌వైజర్లు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

- **విద్యార్థులకు అవగాహన**

యైటింక్లయిన్‌కాలనీ: రామగుండం మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో యైటింక్లయిన్‌కాలనీ స్పందన మోడల్ స్కూల్ విద్యార్థులకు మంగళవారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంపై మున్సిపల్ అధికారులు అవగాహన కల్పించారు. విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన వారికి కమిషనర్ ప్రశంస పత్రాలు అందజేశారు.

- **పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం**

సుల్తానాబాద్: పట్టణంలోని శ్రీలింగేశ్వర హైస్కూల్‌లో 1984–93 వరకు చదువుకున్న విద్యార్థులు మంగళవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు.

- **భగీరథ వాటర్ గ్రిడ్ పరిశీలన**

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని బ్రాహ్మణపల్లి గ్రామ శివారులో ఉన్న మిషన్ భగీరథ ప్రధాన వాటర్ గ్రిడ్‌ను మంగళవారం ఎంపీడీవో అలీం పరిశీలించారు. తాగునీటి సరఫరా విధానాన్ని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పలు గ్రామాలను పరిశీలించి పారిశుధ్య పనులు పర్యవేక్షించారు.

సింగరేణి వార్తలు

80శాతం స్థానికులకే ఉద్యోగాలు



జీఎం సమక్షంలో చర్చలు జరుపుతున్న నాయకులు

గోదావరిఖని: ప్రయివేట్ ఓబీలో 80శాతం ఉద్యోగాలు స్థానికులకు ఇచ్చేందుకు ప్రయివేట్ ఓబీ యాజమాన్యం అంగీకరించడంతో గత 13రోజులుగా జరుగుతున్న సమ్మెకు తెరపడిందని ఆర్జీ–1 జీఎం లలిత్‌కుమార్ తెలిపారు. మంగళవారం కాంగ్రెస్ నాయకులు, ప్రయివేట్ ఓబీ యాజమాన్యం, సింగరేణి సంస్థ మధ్య జరిగిన చర్చలు సఫలం అయ్యాయన్నారు. స్థానిక ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ చొరవతో సమస్య పరిష్కారమైందన్నారు. సింగరేణి సంస్థ కాంట్రాక్టు కార్మికులకు దసరా పండుగకు అడ్వాన్స్ రూ.5వేలు, హెల్పర్లకు రూ.2500 ఇచ్చేందుకు అంగీకారం కుదిరిందన్నారు. కాంగ్రెస్ నాయకులు బొంతల రాజేశ్, శ్రీనివాస్, బాలరాజు, శ్రీనివాస్, లింగస్వామి, ఓదెలు, రమేశ్, పీసీ పటేల్ ప్రయివేట్ ఓబీ యాజమాన్యం పాల్గొంది.

సమ్మెతో బొగ్గు ఉత్పత్తి తగ్గింది

గోదావరిఖని: ఓబీ కాంట్రాక్టు కార్మికుల సమ్మెతో బొగ్గు ఉత్పత్తి తగ్గిందని ఆర్జీ–1 జీఎం లలిత్‌కుమార్ పేర్కొన్నారు. తన కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమ్మెతో 13 లక్షల క్యూబిక్ మీటర్ల ఓబీ, 1.30లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి తగ్గిపోయిందన్నారు. సమ్మె విషయంలో చర్చలు జరుగుతున్నాయని తెలిపారు. జాబ్ గ్యారంటీ పేరుతో జీఎంఆర్ సంస్థ ఉచిత శిక్షణ ఇస్తోందని, దీన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. 'డయల్ యువర్ జీఎం' ద్వారా కార్మికుల సమస్యలు తమ దృష్టికి వచ్చాయని, ఆచరణ సాధ్యమైన వాటిని త్వరగా పరిష్కరిస్తామన్నారు. డీజీఎం (పర్సనల్) కిరణ్‌కుమార్, ఐఈడీ(ఏజీఎం)ఆంజనేయులు, ఈఅండ్‌ఎం(ఏజీఎం) వెంకటేశ్వర్‌రావు, పర్సనల్ మేనేజర్ రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

నాణ్యత ప్రమాణాల విషయంలో రాజీలేకుండా చూడాలి



మాట్లాడుతున్న కార్పొరేట్ జీఎం నికోలస్

గోదావరిఖని: కార్మికుల పిల్లలకు సీబీఎస్‌ఈ విధానం ప్రారంభిస్తున్న క్రమంలో ప్రతిష్టాత్మకంగా తీసుకుని నాణ్యత ప్రమాణాల్లో రాజీలేకుండా ఏర్పాట్లు చేయాలని కార్పొరేట్ పర్సనల్ జీఎం నికోలస్ సూచించారు. ఆర్జీ–2 ఏరియా సెక్టార్–3 పాఠశాలలో సీబీఎస్‌ఈ సిలబస్ ఏర్పాటుపై మంగళవారం జీఎం కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. సిలబస్ మార్పు కోసం పాఠశాలలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. అనంతరం జీఎం కార్యాలయంలో జీఎం ఎల్‌వీ సూర్యనారాయనతో సమావేశమై పనుల పురోగతిపై సమీక్షించారు. కార్పొరేట్ ఈఅండ్‌ఎం జీఎం ఫిర్రాల్ జేసురత్నం, వర్క్‌షాప్ డీజీఎం ఎర్రన్న, పాఠశాల కరెస్పాండెంట్ ఎస్.అనిల్‌కుమార్, సివిల్ డీజీఎం ధనుంజయ, పాఠశాల హెడ్‌మాస్టర్ సుందర్‌రావు పాల్గొన్నారు.

ఆర్జీ–3లో 84శాతం, ఏపీఏలో 74శాతం బొగ్గు ఉత్పత్తి

రామగిరి: సెప్టెంబర్‌లో ఆర్జీ–3లో 84శాతం, ఏపీఏలో 74శాతం బొగ్గు ఉత్పత్తి సాధించినట్లు మంగళవారం ఆర్జీ–3, ఏపీఏ జీఎంలు ఎస్.సుధాకర్‌రావు, కొప్పుల వెంకటేశ్వర్లు వేర్వేరుగా ఒక ప్రకటనలో తెలిపారు. సెప్టెంబర్‌లో ఆర్జీ–3లో నిర్దేశించిన 4.74లక్షల టన్నులకు గాను 3.99 లక్షల టన్నులు అనగా 84శాతం బొగ్గు ఉత్పత్తి, 79శాతం మట్టి తీయడం, 5.14 లక్షల టన్నుల బొగ్గురవాణా చేసినట్లు వెల్లడించారు. ఏపీఏ గనిలో సెప్టెంబర్‌లో నిర్దేశించిన 0.17 లక్షల టన్నులకు 0.13 లక్షల టన్నులు అనగా 76శాతం బొగ్గు ఉత్పత్తి సాధించడంతో పాటు 0.16లక్షల టన్నుల బొగ్గురవాణా జరిగినట్లు పేర్కొన్నారు. భవిష్యత్తులో నిర్దేశించిన లక్ష్యాలు సాధించడానికి సమష్టిగా కృషిచేస్తామన్నారు.

లక్ష్యాల సాధనలో అగ్రగామిగా నిలవాలి

గోదావరిఖని: బొగ్గు ఉత్పత్తి లక్ష్యాల సాధనలో అగ్రగామిగా నిలవాలని ఆర్జీ–2 జీఎం ఎల్‌వీ సూర్యనారాయణ కోరారు. జీఎం కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సెప్టెంబర్‌లో ఏరియాలో 9లక్షల టన్నుల లక్ష్యానికి గాను 5.30లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించినట్లు వివరించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు 36.11లక్షల టన్నుల లక్ష్యానికి 39.34లక్షల టన్నుల ఉత్పత్తి సాధించి నిర్దేశిత లక్ష్యాలకు మించి 109శాతంలో నిలిచామన్నారు. ఇన్‌చార్జి ఎస్‌వోటూ జీఎం సంతోష్‌కుమార్, డీజీఎం పర్సనల్ అనిల్‌కుమార్, ఫైనాన్స్ డీవైజీఎం వెంకటరామచంద్ర, ఐఈడీ డీవైఎస్‌ఈ రాజన్న, మెడికల్ సూపరింటెండెంట్ మహిపాల్ పాల్గొన్నారు.

మహిళలు ఉపాధి శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి



శిక్షణ తరగతులు ప్రారంభిస్తున్న అనిత

గోదావరిఖని: మహిళలు స్వయం ఉపాధి శిక్షణను సద్వినియోగం చేసుకుని ఆర్థిక స్వావలంబన దిశగా ముందుకు సాగాలని ఆర్జీ–1 సేవా అధ్యక్షురాలు అనిత ఆకాంక్షించారు. స్థానిక సేవాభవన్‌లో టైలరింగ్, మగ్గంవర్క్స్, బ్యూటీషియన్, ఫ్యాషన్ డిజైనింగ్ కోర్సులను మంగళవారం ఆమె ప్రారంభించారు. ప్రస్తు కాలంలో కుట్లు, అల్లికలు, మగ్గం వర్క్స్ బ్యూటీషియన్ లాంటి కోర్సులకు డిమాండ్ ఎక్కువగా ఉందన్నారు. ఈ క్రమంలో సంస్థ పూర్తి శిక్షణ ఇచ్చేందుకు ఈకోర్సులు ప్రవేశపెట్టిందన్నారు. దీన్ని సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా రాణించాలని సూచించారు. సమావేశంలో బ్రాంచ్ సెక్రటరీ అరెల్లి పోషం, పర్సనల్ మేనేజర్ రవీందర్ రెడ్డి, సీనియర్ పర్సనల్ ఆఫీసర్ హన్మంతరావు, లేడీస్ క్లబ్ సెక్రటరీ చిలుక లక్ష్మి, సేవాసమితి కోఆర్డినేటర్ మేడి తిరుపతి, కమ్యూనికేషన్ సెల్ కోఆర్డినేటర్ నగునూరి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యల పరిష్కారం కోసం కృషి



మాట్లాడుతున్న రాజ్‌కుమార్

గోదావరిఖని: సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారం కోసం కృషిచేస్తామని ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ అన్నారు. మంగళవారం ఓసీపీ–3 కృషిభవన్‌లో ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. సింగరేణిలో మొదటిసారి కాంట్రాక్టు కార్మికులకు లాభాల వాటా ఇప్పించిన ఘనత ఏఐటీయూసీకి దక్కుతుందన్నారు. ఈనెలలో జరిగే స్ట్రక్చర్ సమావేశంలో ప్రధాన సమస్యలైన పెర్క్స్‌పై ఇన్‌కంటాక్స్ చెల్లింపు, సొంత ఇంటి పథకం అమలు, మారుపేర్ల సమస్య పరిష్కరించేలా కృషి చేస్తామన్నారు. నాయకులు రాజరత్నం, ఎజ్జ రాజయ్య, జీగురు రవీందర్, అన్నారావు, శ్యాంసన్, మహేందర్ పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే 'బిరుదు' జయంతి

పెద్దపల్లిరూరల్: మాజీ ఎమ్మెల్యే బిరుదు రాజమల్లు జయంతి కార్యక్రమాన్ని మంగళవారం బీసీ నాయకుడు, న్యాయవాది ఉప్పు రాజు ఆధ్వర్యంలో పెద్దపల్లిలో నిర్వహించారు. ఈ సందర్భంగా బిరుదు చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.